సాక్షి
వికారాబాద్
సోమవారం ၊ 6 ၊ జనవరి ၊ 2025



తాగు నీటికి కటకట

సంత్రకుంట తండాలో నెల రోజులుగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 8లో▸



రైల్వే బ్రిడ్జి లేక..

నారాయణపూర్ గ్రామానికి వెళ్లే మార్గంలో రైల్వే బ్రిడ్జి నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు. 8లో▸



రోడ్డు సౌకర్యంతోనే...

రోడ్డు సౌకర్యం ఉంటేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేశ్ యాదవ్ అన్నారు. 9లో▸

‘సాక్షి’ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



స్థలం: తాండూరులోని గంగోత్రి విద్యాలయం
స్పాన్సర్: ఇందూర్ రాములు
సమయం: ఉదయం 11నుంచి 12:30
పూర్తి వివరాలకు: సెల్: 8885327301
మొదటి బహుమతి: రూ.10,000
రెండో బహుమతి: రూ.5,000
మూడో బహుమతి: రూ.2,000

అద్దె భవనాల్లో.. అంగన్వాడీ కేంద్రాలు

పూర్వ ప్రాథమిక విద్యతోపాటు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించి, సమాజానికి భావితరాలను అందిస్తున్న అంగన్వాడీలకు సొంతభవనాలు కరువయ్యాయి. దీంతో అద్దె భవనాలు, కమ్యూనిటీ హాళ్లలో, పాఠశాల భవనాల్లో ఇతర కార్యాలయాలతో వీటిని నెట్టుకొస్తున్నారు. దీంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బంది పడుతున్నారు.

- సగానికి పైగా సెంటర్లకు సొంత భవనాలు కరువు
- ఇబ్బందులు పడుతున్న చిన్నారులు, గర్భిణులు, బాలింతలు
- పట్టించుకోని పాలకులు



ద్వాక్రా భవనంలో కొనసాగుతున్న బుద్దాపూర్ అంగన్వాడీ కేంద్రం

వికారాబాద్: చిన్నారులకు సేవలందించే అంగన్వాడీలకు గూడు గోస తీరడం లేదు. చాలీచాలని వసతులతో అగచాట్లు తప్పడం లేదు. జిల్లాలో సగానికిపైగా అంగన్వాడీ కేంద్రాలు ఇబ్బందుల్లోనే ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటై దశాబ్దాలు గడుస్తున్నా మెజార్టీ అంగన్వాడీ కేంద్రాలు సొంత భవనాలకు నోచుకోవడం లేదు. దీంతో చాలా వరకు అద్దెభవనాల్లో కొనసాగుతుండగా.. మిగిలిన కేంద్రాలు (రెంట్ ఫ్రీ బిల్డింగ్స్) పాఠశాలలు, ఇళ్లు, తదితర చోట్లు కొనసాగుతున్నాయి. సొంత భవనాలు లేక సౌకర్యాలు లేక కేంద్రాలు మార్చుతుండంతో నిర్వాహకులు, చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలో 1,106 కేంద్రాలకు 468 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలుండగా 56,900 మంది చిన్నారులకు 6,313 మంది గర్భిణులకు 5,683 మంది బాలింతలకు సేవలందిస్తున్నారు.

ప్రతిపాదనలకే పరిమితం

గ్రామ సభలు మొదలుకుని మండల సర్వసభ్య సమావేశాలు, జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాలు, స్థాయి సంఘాల మీటింగ్‌లు, అధికారులు, ప్రజా ప్రతినిధులు నిర్వహించే సమీక్ష సమావేశాలు.. ఇలా ఏ మీటింగ్‌లు నిర్వహించినా అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాల విషయం చర్చకు వస్తుంది. సొంత భవనాలు కావాలంటూ కేంద్రాల నిర్వాహకులతో పాటు సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు ప్రతీ సమావేశంలో అడుగుతూనే ఉన్నారు. ఇప్పటి వరకు నిర్మించిన అంగన్వాడీ కేంద్రాలు ఎక్కువ శాతం జెడ్పీ నిధులు, ఏసీడీపీ నిధులతో నిర్మించారు. ఇటీవల స్థానిక సంస్థలు నిధుల లేమితో కూనరిల్లుతుండటంతో వారు సైతం చేతులెత్తేస్తున్నారు. గత ఆరేళ్లుగా అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్చకు వచ్చిన ప్రతిసారి ప్రతిపాదనలు పంపిస్తున్నామంటున్నారే తప్ప మంజూరుకి నోచుకోవడంలేదు.

జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు

ఐసీడీఎస్ ప్రాజెక్ట్	సొంత భవనాలు	అద్దె భవనాలు	రెంట్ ఫ్రీ బిల్డింగ్స్	మొత్తం
కొడంగల్	09	92	133	234
పరిగి	109	11	93	213
మర్పల్లి	104	04	40	148
వికారాబాద్	101	24	107	238
తాండూరు	145	54	80	279

అంగన్వాడీ సేవల వివరాలు

చిన్నారులు	56,900
గర్భిణులు	8,701
బాలింతలు	6,209

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న డాక్టర్ మెతుకు ఆనంద్ తదితరులు

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఆనంద్

మోమిన్‌పేట: ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఆరోపించారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఎకరాకు రూ.15వేలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటికే వానాకాలం, యాసంగి పెట్టుబడి సాయం అందిచలేదని.. ఇప్పుడు రూ.12వేలు ఇస్తామంటూనే సర్వేలు, డిక్లరేషన్‌లు పెడుతూ రైతులను గోసపెడుతున్నారని మండిపడ్డారు. రైతుబంధు నిధులు దుర్వినియోగం అయ్యాయని నిబంధనలు మారుస్తున్నామంటూ కాలయాపన తప్ప చేసిందేమీ లేదన్నారు. సంక్రాంతికి రైతు భరోసా, భూమి లేని కౌలు రైతులకు రూ.12వేలు, రేషన్‌కార్డుదారులకు జనవరి నుంచి సన్న బియ్యం పంపిణీ చేస్తామని మొండి చేయి చూపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్యాస్ సబ్సిడీ ఒక నెలకే పరిమితం చేశారని ఆరోపించారు. ప్రతీ మహిళకు రూ.2,500 ఇస్తామని చెప్పి ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేసేంతవరకు బీఆర్ఎస్ ప్రశ్నిస్తూనే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీకాంత్, బీఆర్ఎస్ యువజన సంఘం మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, నాయకులు అజీజ్, భిక్షపతి, శ్రీరాములు, మైపాల్, అప్సర్, ఖాదర్, రాజు తదితరులు ఉన్నారు.

హిందూ ధర్మం దేశానికి రామరక్ష

మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

పరిగి: హిందూ ధర్మం, హిందూ జాతీయ వాదం దేశానికి శ్రీరామరక్ష అని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని శ్రీనివాస కాలనీలో ఆధ్యాత్మికవేత్త, సామాజిక, రాజకీయ విశ్లేషకులు డాక్టర్ భాస్కరయోగి ఆధ్వర్యంలో నిర్వహించిన పుష్య సత్సంగంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ.. ప్రపంచ దేశాల్లో జరుగుతున్న ఘర్షణలు, అలజడులకు సనాతన ధర్మంలో పరిష్కారం దొరుకుతుందన్నారు. శాస్త్రాధారంగా జీవన విధానాన్ని కొనసాగించి ఆచార సంప్రదాయాలను అనుసరిస్తే భగవంతుడి కరుణ ఉంటుందన్నారు. దీంతో పరిపూర్ణ జీవితానికి అవకాశం ఉంటుందని చెప్పారు. సమర్థుడైన గురువు ఆధ్వర్యంలోనే పరిపూర్ణ జ్ఞానం వికసిస్తుందన్నారు. ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త భాస్కరయోగి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, నాయకులు ప్రహ్లాద్‌రావు, శివరాజ్, బాలకృష్ణారెడ్డి, రామయాదవ్, పాండురంగాచారి, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

అమరారాజాలో ఉద్యోగాలకు నేడు ఇంటర్వ్యూలు

దుద్యాల్: మహబూబ్‌నగర్ పట్టణంలో అమరరాజా కంపెనీలో ఉద్యోగాల కోసం కడా కార్యాలయంలో సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు అధికారి వెంకట్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగాలకు 10వ తరగతి పాసైన, ఇంటర్ పాస్ లేదా ఫెయిల్ అయిన మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని.. ఉద్యోగాలకు ఎంపికైన వారికి మొదటి ఆరు నెలలు తిరుపతి వద్ద ఉన్న ఫ్యాక్టరీలో శిక్షణ ఉంటుందన్నారు. తదనంతరం మహబూబ్‌నగర్‌లో ఉన్న అదే కంపెనీలో ఉద్యోగం కల్పిస్తారని చెప్పారు. శిక్షణ కాలంలో నెలకు రూ.12వేలు, అనంతరం రూ.15 వేల వేతనం అందజేస్తారని వివరించారు. ఆసక్తి ఉన్న మహిళలు బయోడేటా, ధృవపత్రాలతో ఇంటర్వ్యూకు హాజరవ్వాలన్నారు.

నేడు పోలెపల్లిలో భూ సర్వే

దుద్యాల్: ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు చేపట్టనున్న భూ సర్వే సోమవారం మండల పరిధిలోని పోలెపల్లిలో నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కిషన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశాల మేరకు గ్రామ పరిధిలోని 67 సర్వే నంబర్‌లోని 71.39 ఎకరాల అసైన్డ్ భూమికి సంబంధించిన సర్వే చేయనున్నట్లు తెలిపారు. పట్టదారుడి సర్వే నంబర్ ఆధారంగా వారి భూ స్థలాలను గుర్తిస్తామన్నారు. ప్రస్తుతం పట్టా పాసుపుస్తకంలో ఉన్నంత భూమి పొజీషన్‌లో ఉన్నారా లేదా అనే విషయాలను గుర్తిస్తామన్నారు. రైతులు అందకూ అందుబాటలో ఉండాలని కోరారు. గత వారంలో హకీంపేట్‌లో నిర్వహించిన 351 ఎకరాల సర్వే పూర్తయిందన్నారు.

రేపటి నుంచి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ


కుల్కచర్ల: మండల పరిధిలోని బండవెల్కిచర్ల గ్రామంలో మంగళవారం నుంచి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్లు యువజన సంఘాల నాయకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామానికి చెందిన బాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి జ్ఞాపకార్థం ఈ టోర్నీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీల్లో పాల్గొనాలనుకునే వారు సోమవారం టీం వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు కృష్ణ 9490728512, గోవర్ధన్ రెడ్డి 9381557413 నంబర్లను సంప్రదించాలన్నారు.

‘లక్ష డప్పులు.. వేయి గొంతులు’ విజయవంతం చేయాలి

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్

తాండూరు రూరల్: ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు పోరాటం ఆగదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మల్లికార్జున్ మాదిగ మాట్లాడుతూ.. ఫిబ్రవరి 7న ‘లక్ష డప్పులు.. వేయి గొంతులు’ ప్రదర్శన విజయవంతం చేయాలన్నారు.

కానిస్టేబుల్ బలవన్మరణం



భానుశంకర్ (ఫైల్)

పరిగి: అనారోగ్య సమస్యలు, పనిభారంతో పరిగి పీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుల్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. వివరాలు.. దోమ మండలం దొంగెన్కేపల్లికి చెందిన భాను శంకర్(46) పరిగి ఠాణాలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పిల్లల చదువులకోసం నగరంలోని అంబర్‌పేట్‌లో నివాసం ఉంటున్నాడు. ఆదివారం మధ్యాహ్నం కుటుంబ సభ్యులు ఇంట్లో ఉన్న సమయంలోనే బెడ్రూంలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. భానుశంకర్‌కు మూర్ఛ వ్యాధితో పాటుగా ఐదేళ్లుగా అనారోగ్య సమసమ్యలతో ఇబ్బంది పడుతున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

స్పీకర్‌ను కలిసిన ట్రెసా ప్రతినిధులు



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ట్రెసా ప్రతినిధులు

అనంతగిరి: శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను ఆదివారం తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధులు నగరంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ కుమార్, సంయుక్త కార్యదర్శి మనోహర్ చక్రవర్తి, జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి విజయేందర్, శ్రీనివాస్‌రెడ్డి, మునీరుద్దీన్, విజయ్‌కుమార్, సురేశ్‌కుమార్, విజయ్, బాలరాజు, నరేందర్, రవి కిషోర్, పాండు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కురుమలు రాజకీయంగా ఎదగాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం

మీర్‌పేట: కురుమలు రాజకీయంగా ఎదగాలని రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం పిలుపునిచ్చారు. మీర్‌పేటలో ఆదివారం జిల్లా కురుమ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కురుమలు స్థానికంగా అన్ని వర్గాలను కలుపుకొని పోవడంతో పాటు ఐక్యంగా ఉండి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించాలని ఆకాంక్షించారు. సొసైటీలు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. జిల్లాలో కురుమ సంఘం భవనం ఏర్పాటుకు స్థలం కోసం త్వరలోనే కలెక్టర్‌ను కలుస్తానని, వీలైతే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో కురుమలకు దక్కాల్సిన వాటా ప్రకారం టికెట్లు కేటాయించాలని సీఎంను కోరినట్లు చెప్పారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సిద్దాల దశరథ మాట్లాడుతూ.. ఐకమత్యంగా ఉంటేనే ఏదైనా సాధించవచ్చని అన్నారు. ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో పాటు రానున్న ఎన్నికల్లో కురుమల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు నారాయణ, హాస్టల్ చైర్మన్ కొలుకుల నర్సింహ, గొర్రెల కాపర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కిష్టగోని సదానందం, నాయకులు సిద్దాల బాలప్ప, సిద్దాల శ్రీశైలం, మీర్‌పేట అధ్యక్షుడు దేవరింటి వెంకటేశ్, అచ్చిని యాదగిరి, సిద్దాల జగదీశ్, మేకల ప్రశాంత్, పద్మశ్రీ, రేణుక పాల్గొన్నారు.

మానవత్వం చాటిన కానిస్టేబుల్ కుటుంబం

- రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ కానిస్టేబుల్ మృతి
- అవయవాలను దానం చేసిన కుటుంబం



ప్రశాంత్‌రెడ్డి (ఫైల్)

కందుకూరు: రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ కానిస్టేబుల్ మృతి చెందగా వారి కుటుంబీకులు అవయవ దానం చేసి పలువురి ప్రాణాలను కాపాడి మానవత్వాన్ని చాటుకున్నారు. ఉప్పల్‌కు చెందిన పెద్దోళ్ల ప్రశాంత్‌రెడ్డి నాలుగేళ్లుగా కందుకూరు పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. గతనెల 28న విధులు ముగించుకుని బైక్‌పై తిరిగి ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో పహడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటి నుంచి మలక్‌పేట యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. దీంతో ప్రశాంత్‌రెడ్డి తండ్రి రిటైర్డ్ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ నాగిరెడ్డి, తల్లి సౌమ్య జీవన్‌దాన్‌కు కిడ్నీలు, కాలేయం ఇచ్చారు. తమ బిడ్డ ప్రాణం పోయిన బాధలోనూ అవయవ దానానికి ముందుకు రావడంపై రాచకొండ పోలీస్ కమిషనర్ జి.సుధీర్‌బాబు వారిని అభినందించారు. శాఖాపరంగా అన్ని విధాలా ఆదుకుంటామని చెప్పారు. అవయవదానం చేసిన వారు భౌతికంగా మరణించినప్పటికీ జీవించి ఉన్నట్లేనని, అవయవదానంతో మరొక మనిషికి ప్రాణం పోయడం గొప్ప విషయమన్నారు. ఉప్పల్‌లో ఆదివారం జరిగిన ప్రశాంత్‌రెడ్డి అంత్యక్రియల ఖర్చులకు రూ.90 వేలు మంజూరు చేశారు. సీపీ తరఫున మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి, సీఐ సీతారాం, రాచకొండ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు సీహెచ్ భద్రారెడ్డి, కోఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ సువర్ణ, సహచరులు అంత్యక్రియలకు హాజరయ్యారు.

ఉత్సాహంగా ‘హరిత పరివారం’ సంబరాలు



సంబురాల్లో సంస్థ సభ్యులు

కడ్తాల్: అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని ఎర్త్ సెంటర్‌లో కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో ఆదివారం ‘హరిత పరివారం ఆత్మీయ కుటుంబ సమ్మేళనం’ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పదిహేనేళ్లుగా సీజీఆర్ సంస్థ ఆధ్వర్యంలో జయప్రదంగా నిర్వహించిన కార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు. భవిష్యత్ కార్యక్రమాలకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకొంటూ కుటుంబ సమేతంగా ఆనందోత్సాహాల మధ్య సంబరాలు చేసుకున్నారు. ముగ్గుల పోటీలు, బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఉత్సాహంగా గాలిపటాలు ఎగురవేశారు. భోగి మంటలు వేసి ఉత్సవాలు జరుపుకొన్నారు. కార్యక్రమంలో సీజీఆర్ చైర్‌పర్సన్ లీలా లక్ష్మారెడ్డి, వ్యవస్థాపకుడు లక్ష్మారెడ్డి, ఆచార్య పురుషోత్తంరెడ్డి, సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి, పర్యావరణవేత్త దొంతి నరసింహారెడ్డి, పర్యావరణ నిపుణులు శివప్రసాదరావు, తులసీరావు, ఇంద్రసేనరెడ్డి, వెంకట్‌రెడ్డి, అన్నమయ్య, రాజేందర్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, ఉమామహేశ్వర్‌రెడ్డి, అనుదీప్, నగేశ్, కోటి, లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



కుర్మిద్దలో ఇటీవల ర్యాలీ చేపట్టిన రైతులు

ఆందోళనలపై పోలీసు నిఘా

- ఫ్యూచర్ సిటీపై సర్కార్ నజర్
- సీఎంఓ నుంచి కచ్చితమైన ఆదేశాలు
- రైతుల కదలికలపై పోలీసు శాఖ దృష్టి
- ఆటంకాలు లేకుండా నిర్మాణం జరిగేలా చర్యలు

యాచారం: ఫ్యూచర్‌సిటీ నిర్మాణానికి రేవంత్‌రెడ్డి సర్కార్ వడివడిగా అడుగులు వేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎలాంటి సమస్య, అల్లర్లు ఉండరాదని, అలా జరిగితే పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపకపోవచ్చని భావిస్తోంది. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఫ్యూచర్‌సిటీకి ఎవరైనా భంగం కలిగించాలని చూస్తే కఠిన చర్యలు తీసుకోవాలని నేరుగా సీఎంఓ నుంచి పోలీస్ ఉన్నతాధికారులకు ఆదేశాలు అందినట్లు సమాచారం. పట్టా భూముల పరిహారం అథారిటీలో జమ చేసిన రైతులకు మరింత పెంచి ఇచ్చేందుకు సంసిద్ధంగా ఉన్నట్లు తెలిసింది. ఇటీవలే కుర్మిద్ద గ్రామంలో పట్టా భూములకు ఎకరాకు రూ. 25 లక్షలకు పైగా పరిహారాన్ని అందించడం విశేషం.

రికార్డుల్లో టీజీఐఐసీని తొలగించాలని..

గత బీఆర్ఎస్ సర్కార్ హయాంలో ఫార్మాసిటీకి పట్టా భూములు ఇవ్వని రైతుల భూములపై రాత్రికిరాత్రే అవార్డులు పాస్ చేశారు. భూ రికార్డుల్లో రైతుల పేర్లను తొలగించి టీజీఐఐసీ పేరు నమోదు చేశారు. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ తాము అధికారంలోకి వస్తే టీజీఐఐసీ పేరు తీసేసి రైతుల పేర్లు మార్చుతామని హామీ ఇచింది. అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా రైతులకు న్యాయం జరగడం లేదు. ఈ క్రమంలో దాదాపు 2,211 ఎకరాల పట్టా భూములకు సంబంధించి రికార్డుల్లో తమ పేర్లు నమోదు చేయించాలని వారు మళ్లీ ఆందోళనబాట పట్టారు. గ్రామాల్లో ర్యాలీలు తీస్తూ మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. మరోవైపు సీఎంఓ అధికారుల ఆదేశాల మేరకు గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులు నిఘా పెట్టారు. అనుమతి లేకుండా ర్యాలీలు తీస్తే కేసులు నమోదు చేసేందుకు సిద్ధమయ్యారు.

భూముల స్వాధీనానికి సిద్ధం

పరిహారం పొందిన భూముల్లో రైతులు మూడేళ్లుగా ఆయా పంటలను పండిస్తూ ఆదాయం పొందుతున్నారు. మళ్లీ బోరుబావులు తవ్వించి వ్యవసాయం చేసుకుంటున్నారు. సాగు చేసిన పంటలు మరో నెల, రెండు నెలల్లో చేతికి రానున్నాయి. ఆ వెంటనే భూములను స్వాధీనం చేసుకుని మళ్లీ సాగు చేయకుండా చూడాలని అధికారులు నిర్ణయించారు.

మాట నిలబెట్టుకోవాలి



అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. టీజీఐఐసీ పేర్ల మీద మార్చేసిన భూ రికార్డులను రైతుల పేర్ల మీద మార్చాలి. అప్పట్లో పట్టా భూములు తీసుకోమని హామీ ఇచ్చారు. ఇప్పుడు అడిగితే అరెస్టులు చేస్తామని అంటున్నారు.

– ముత్యాల రాంచంద్రారెడ్డి, రైతు, నానక్‌నగర్


హద్దు మీరితే చర్యలు



అనుమతి లేకుండా ఫ్లెక్సీలు, బ్యానర్లతో ర్యాలీలు, ఆందోళనలు, ధర్నాలు చేస్తే సహించేది లేదు. చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుంది. ఏమైనా సమస్యలుంటే ప్రభుత్వ పెద్దలకు విన్నవించుకోవచ్చు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే మాత్రం కేసులు నమోదు చేయాల్సి వస్తుంది.

– లిక్కి కృష్ణంరాజు, సీఐ హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్

ఫ్యూచర్ సిటీతో అభివృద్ధి



ఫార్మాసిటీనే రద్దు చేశాక రైతులు మళ్లీ గ్రామాల్లో ర్యాలీలు తీయడం సరైంది కాదు. సీఎంఓ నుంచి కచ్చితమైన ఆదేశాలు ఉన్నాయి. రైతులు చట్టపరిధి దాటి వ్యవహరించొద్దు. పరిహారం పెంపు, ఇతర ప్రయోజనాల కోసం దరఖాస్తులు ఇవ్వండి. ఫ్యూచర్‌సిటీతో ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుంది.

– మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్యే, ఇబ్రహీంపట్నం

క్లుప్తంగా

కాంగ్రెస్ పేదల ప్రభుత్వం

- ఎమ్మెల్యే బీఎమ్మార్
- 98 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత


చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బీఎమ్మార్

తాండూరు టౌన్: కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని 98 మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం దశలవారీగా అమలు చేస్తోందన్నారు. ఏడాది పాలనలో సంక్షేమం, అభివృద్ధిలో పురోగమిస్తూ ప్రజల మన్ననలు పొందుతుందన్నారు. అనారోగ్యంతో చికిత్స తీసుకుంటున్న పేదలకు సీఎంఆర్ఎఫ్ అండగా ఉంటుందన్నారు.

ఆర్.కృష్ణయ్యకు నేతల అభినందన


కృష్ణయ్యను కలిసిన మండల నాయకులు

యాలాల: బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యను యాలాల మండల నుంచి బీసీ సంఘం అధ్యక్షుడు చెన్నారం లక్ష్మణాచారి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలమాల, శాలువాతో సన్మానించారు. అనంతరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. బీసీల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తున్న కృష్ణయ్య సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు గాజుల మన్నాన్, నాయకులు అక్కంపల్లి నగేష్, రాజు, తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కుల్కచర్ల: ఎదురెదురుగా వస్తున్న ఆటో–బైక్ ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కుల్కచర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బండవెల్కిచర్ల గ్రామం నుంచి కుల్కచర్ల వైపు వస్తున్న ఓ బైక్ ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పరిగి మండలం మల్లేమోనిగూడ గ్రామానికి చెందిన గోపాల్, మల్లేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రులను అంబులెన్స్‌లో పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

నవాబుపేట: పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసిన సంఘటన మండలంలోని ఎక్‌మామిడి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొంతమంది బంగారు మైసమ్మ ఆలయ ఆవరణలో ఆదివారం సాయంత్రం పేకాట ఆడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ అరుణ్ కుమార్ తన సిబ్బందితో వెళ్లి ముగ్గురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి మూడు సెల్ ఫోన్లు, ఐదు బైక్‌లు, రూ.29 వేల నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

తాగు నీటికి కటకట

గుక్కెడు నీటికి రోజుల తరబడి వేచి చూస్తున్న పరిస్థితి దాపురించింది. మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో తండావాసులు తల్లడిల్లుతున్నారు. స్థానికంగా ఉన్న బోర్లు నిర్వీర్యమవ్వడంతో గత్యంతరం లేక వ్యవసాయ మోటార్ల వద్ద తెచ్చుకొని అవసరాలు తీర్చుకుంటున్నారు. ఇదీ దుద్యాల్ మండలంలోని సంత్రకుంట తండాలో దుస్థితి.

- నెల రోజులుగా అందని 'భగీరథ' నీరు
- వ్యవసాయ బోర్లను ఆశ్రయిస్తున్న సంత్రకుంట తండావాసులు
- పట్టించుకోని అధికారులు

దుద్యాల్: మండల పరిధిలోని సంత్రకుంట తండాలో నెల రోజులుగా ప్రభుత్వం సరఫరా చేస్తున్న మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే విషయమై అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి సరఫరా అయ్యే గ్రామ పంచాయతీ బోర్ కూడా రోడ్డు విస్తరణ పనులకు అడ్డొస్తుందని మోటారును తీసుకెళ్లారని తండావాసులు వాపోతున్నారు. ఇటు మిషన్ భగీరథ నీరు రాక.. అటు గ్రామ పంచాయతీ బోరు మోటార్ నుంచి నీరు రాకపోవడంతో తండాకు దగ్గరలో పొలాల వద్ద ఉన్న వ్యవసాయ బోర్ల నుంచి నీటిని తెచ్చుకుని జీవనం సాగిస్తున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


నిరుపయోగంగా గ్రామ పంచాయతీ బోరు

శిథిలావస్థకు చేరిన ట్యాంక్

పంచాయతీ బోరు ద్వారా గ్రామంలో వాటర్ ట్యాంకులోకి నీరు సరఫరా అయ్యేది. కొద్ది రోజులుగా బోరు నుంచి నీరు సరఫరా కాకపోవడంతో వాటర్ ట్యాంకు సైతం నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం అది శిథిలావస్థకు చేరుతుందని తండావాసులు అంటున్నారు. మిషన్ భగీరథ వాటర్ సైతం రాక తీవ్ర అవస్థలు పడుతున్నామంటున్నారు. నెల రోజులుగా ఇదే సమస్య ఎదుర్కొవాల్సి వస్తుందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి తండాకు నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


నీరు లేని వాటర్ ట్యాంక్

చాలా ఇబ్బంది పడుతున్నాం



తండాకు మిషన్ భగీరథ, పంచాయతీ బోరు నుంచి తాగు నీరు రావడం లేదు. నిత్యం వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నాం. పలుమార్లు అధికారులను అడుకున్న పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు తండాకు నీరు అందించేలా చర్యలు తీసుకోవాలి. – కవితాబాయి, సంత్రకుంట తండా

రైల్వే బ్రిడ్జి లేక.. వెతలు తీరక

తాండూరు రూరల్: మండల పరిధిలోని నారాయణపూర్ గ్రామానికి వెళ్లే మార్గంలో రైల్వే బ్రిడ్జి నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు. పట్టణంలోని పాత తాండూరు మీదుగా నారాయణపూర్‌తో పాటు పలు గ్రామాలకు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే నారాయణపూర్ గ్రామ సమీపంలో రైల్వేగేటు ఉంది. ఎన్నో ఏళ్లుగా రైల్వే గేటు వద్ద అండర్ బ్రిడ్జి నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు. రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మిస్తే మండలంలోని నారాయణపూర్, గోనూర్, వీర్‌శెట్టిపల్లితో పాటు బషీరాబాద్ మండలంలోని రెడ్డిఘనాపూర్, మంతట్టి, కాశీంపూర్‌లకు వెళ్లే వాహనదారులకు ఇబ్బందులు తీరనున్నాయి. అర గంటకు ఒకసారి గేటు పడటంతో ఆయా గ్రామాలకు వెళ్లే వాహనదారులు దీర్ఘకాలికంగా ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే అధికారులు స్పందించి అండర్ రైల్వే బ్రిడ్జి నిర్మించాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.


రైల్వే గేటు వద్ద వాహనదారుల పడిగాపులు

తైక్వాండోలో పోలీసుల ప్రతిభ

అనంతగిరి: తైక్వాండో పోటీల్లో సత్తాచాటిన పోలీసులను స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అభినందించారు. ఇటీవల వియత్నాంలో జరిగిన ఆసియా ఓపెన్ పోలీస్ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో దేశం తరపున వికారాబాద్‌కు చెందిన హెడ్‌కానిస్టేబుల్ గోపాల కృష్ణయ్య సీనియర్–2 బ్లాక్ బెల్ట్ 3వ విభాగంలో బంగారు పతకం సాధించగా, పరిగి మండలం సోమన్‌గుర్తి గ్రామానికి చెందిన రాచకొండ కమిషనరేట్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సంజీవ్ కుమార్ సీనియర్స్–1 బ్లాక్ బెల్ట్ 3వ విభాగంలో కాంస్య పతకం సాధించారు. ఈ మేరకు వారిని వికారాబాద్‌లో పర్యటనకు వచ్చిన అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తైక్వాండో జిల్లా అధ్యక్షుడు గోపాల కృష్ణ , మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


పోలీసులను అభినందిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

కొనాపూర్ దొంగతనం కేసులో పురోగతి

తాండూరు రూరల్: మండల పరిధిలోని చెన్గేస్‌పూర్ అనుబంధ గ్రామం కొనాపూర్ దొంగతనం కేసులో పోలీసులు పురోగతి సాధించారు. ఈ మేరకు ఆదివారం సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలించి నేరస్తులను గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు నాలుగు ఇళ్లల్లో దొంగతనం చేశారు. ఈ ఘటనపై కరన్‌కోట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇప్పటికే తాండూరు డీఎస్పీ బాలకృష్ణరెడ్డి వికారాబాద్ నుంచి క్లూస్ టీం ఆఫీసర్ శ్రీశైలం ఆధ్వర్యంలో వివరాలు సేకరించారు. అయితే దొంగలకు సంబంధించిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. దొంగలు మాత్రం మూతికి మాస్కులు ధరించి, టోపీలు పెట్టుకొని హల్‌చల్ చేశారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఏసీపీ రాజు

మంచాల: చెడు మార్గాలకు దూరంగా యువత దూరంగా ఉండాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని బండలేమూర్‌లో నిర్వహించిన బీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ తోపాటు 5 కే రన్, 2 కేరన్ కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశానికి యువశక్తి ఎంతో విలువైందన్నారు. యువత వ్యసనాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దని సూచించారు. ప్రభుత్వ సహకారంతో అభివృద్ధి దిశగా అడుగులు వేయాలన్నారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండే విధంగా యువత కృషి చేయాలన్నారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని కోరారు. బండలేమూర్ గ్రామంలో యువతను మేల్కొపే విధంగా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సీఐ మధు, నాయకులు రాంరెడ్డి, వెంకటేష్, శ్రీనివాస్, శివకుమార్, ప్రదీప్, కృష్ణ, విక్రమ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే సాధనతో మానసికోల్లాసం


గెలుపొందిన విద్యార్థులతో సినీనటుడు సుమన్

సినీనటుడు సుమన్

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులలో యుద్ధవిద్యలు ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తాయని సినీనటుడు సుమన్ అన్నారు. యాదవ్ బుడోకాన్ కరాటే క్లబ్ ఫౌండర్ మల్లేశ్‌యాదవ్ స్మారకార్థం ఆదివారం ఆ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ఓ గార్డెన్‌లో 38వ ఆల్ ఇండియా లెవల్ ఓపెన్ కరాటే, కుంగ్ ఫూ చాంపియన్‌షిప్ నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా సినీనటుడు సుమన్ హాజరై మాట్లాడుతూ.. కరాటే, కుంగ్ ఫూ వంటివి విద్యార్థులకు ఎంతో అవసరమని అన్నారు. ఆపద సమయంలో రక్షించుకునేందుకు ఎంతో దోహదపడతాయన్నారు. కరాటే, కుంగ్ ఫూ సాధనతో శారీరక దృఢత్వంతో పాటుగా మానసికోల్లాసం కలుగుతుందన్నారు. విద్యార్థులు మత్తుపదార్థాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కరాటే పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది మహేందర్‌రెడ్డి, అశోక్‌యాదవ్, కరాటే మాస్టర్లు సాయినాథ్‌యాదవ్, ఉత్తేజ్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల పోటీల్లో విద్యార్థుల సత్తా


బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

తాండూరు టౌన్: మిల్లెట్–యుటోపియా(చిరుధాన్యాలు) ఆవశ్యకతపై నిర్వహించిన పోటీల్లో తాండూరులోని నేతాజీ గురుదేవ్ గురుకుల్ విద్యార్థులు ఏకంగా ఆరు బహుమతులు సాధించి సత్తా చాటారు. ఆదివారం హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ప్లాంట్ సైన్సెస్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. మొత్తం 1,400 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో విభాగాల వారీగా ఉపన్యాసంలో పి.కార్తీక్ (10వ), పి.విజయలక్ష్మి (9వ) ప్రథమస్థానం, క్విజ్ పోటీలో తనూష్ రెడ్డి, హర్షితారెడ్డి ద్వితీయ స్థానం, చిత్రలేఖనం, స్కిట్ పోటీల్లో జస్వంత్ రెడ్డి మూడో స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ మణిమాల మాట్లాడుతూ.. వాతావరణ మార్పులను ఎదుర్కొని పెరుగుతూ, ఆరోగ్య భద్రత, పోషకాలను అందించే శక్తి చిరుధాన్యాలకు ఉందన్నారు. చిరుధాన్యాల ప్రాముఖ్యత పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. పాఠశాల విద్యార్థులు సత్తా చాటడంతో డైరెక్టర్ మణిమాల, ప్రిన్సిపాల్ శివలీల, ఉపాధ్యాయులు మల్లికార్జున్ రెడ్డి, శ్వేత, శ్రీకాంత్, నందిని, మాధురి, సంతోషి, ప్రియాంక, శ్రీశైలం, భాగ్యశ్రీ అభినందనలు తెలిపారు.

ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషి


నూతన కార్యవర్గసభ్యులను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

యువజన సంఘం అధ్యక్షుడు రాహుల్‌గుప్తా

షాబాద్: ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన ఆర్యవైశ్య మహాసభ జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు దండు రాహుల్ గుప్తా అన్నారు. ఆర్యవైశ్య మహాసభ జిల్లా యువజన సంఘం నూతన కార్యవర్గ సభ్యులను ఆదివారం నగరంలోని చంపాపేటలో ఓ గార్డెన్‌లో రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం చేయించారు. జిల్లా అధ్యక్షుడిగా దండు రాహుల్‌గుప్తా, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా నరాల పూర్ణచందర్‌గుప్తా, చొక్కంపేట్ రాకేశ్‌గుప్తా, యాచం నవీన్‌గుప్తా, ఉపాధ్యక్షులుగా వెంకటరమణ, లక్ష్మీనర్సింహులు, గడ్డం రమేష్‌గుప్తా తదితరులను ఎనుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను ఆర్యవైశ్య సంఘం పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం నూతనంగా రాహుల్‌గుప్తా మాట్లాడుతూ.. ఆర్యవైశ్యుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సంఘం మండల నాయకులు సాయిరాం గుప్తా, కృష్ణగుప్తా, బస్వరాజ్‌గుప్తా, కిషోర్‌గుప్తా, మదన్‌గుప్తా, శ్రీనివాస్‌గుప్తా, వెంకటేశ్‌గుప్తా, రాఘవేందర్‌గుప్తా, రామ్మోహన్‌గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో సర్కారు విఫలం

బీఆర్ఎస్ యూత్ విభాగం రాష్ట్ర నాయకుడు రాజేందర్‌గౌడ్

అనంతగిరి: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా ఆరు గ్యారంటీలను అమలు చేయలేదని బీఆర్ఎస్ యూత్ విభాగం రాష్ట్ర నాయకుడు రాజేందర్‌గౌడ్ ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఆధ్వర్యంలో ప్రభుత్వం వెంటనే ఆరు గ్యారంటీలు అమలు చేయాలని వికారాబాద్‌లో నేతలు ధర్నా చేపట్టారు. అంతకుముందు తెలంగాణ అమరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇచ్చిన మాట ప్రకారం వెంటనే హామీలు అమలు చేయాలన్నారు. ప్రజా సమస్యల పట్ల బీఆర్ఎస్ ముందుండి పోరాటం చేస్తుందన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ క్రమంలో ధర్నా చేస్తున్న నాయకులను పోలీసులు అరెస్టు చేసి పీఎస్‌కు తరలించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర నాయకుడు భూమొల్ల కృష్ణయ్య, నాయకులు చైతన్య, సత్యనారాయణ, శ్రీనివాస్‌గౌడ్, హన్మంత్‌రెడ్డి, నర్సింలు, సంగమేష్‌యాదవ్, అశోక్‌గౌడ్, శివశంకర్, రాము, మహేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.


అమరుల స్తూపం వద్ద బీఆర్ఎస్ నాయకులు

కార్మికులకు వేతనాలు పెంచాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జగదీష్

తుర్కయంజాల్: మున్సిపల్ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం స్పందించి వేతనాలను పెంచకుంటే నిరవధిక సమ్మెకు దిగుతామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.జగదీష్ హెచ్చరించారు. యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తుర్కయంజాల్‌లో మున్సిపల్ కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, ఎన్ఎంఆర్, ఫిక్స్‌డ్ పే తదితర పద్ధతుల్లో పనిచేస్తున్న సిబ్బందిని వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని, 2వ పీఆర్సీ కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, దాసు, మహేష్, వెంకటేష్, భాగ్యమ్మ, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.


దీక్షలో పాల్గొన్న మున్సిపల్ కార్మికులు

పొగమంచు గమనించు!

- ముందు వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు
- చలికి తలెత్తుతున్న శ్వాసకోశ సమస్యలు
- జాగ్రత్తలు పాటించాలంటున్న నిపుణులు


షాబాద్‌లో కమ్ముకున్న పొగమంచు

షాబాద్: పొగమంచు జిల్లాపై పంజా విసురుతోంది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఓ వైపు శీతల వాతావరణం, మరోవైపు పొగమంచు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. చల్లటి గాలులకు శ్వాసకోశ సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు చెబుతున్నారు.

ఆరోగ్య నియమాలు

- వెచ్చని దుస్తులు ధరించడంతో పాటు వేడి పానియాలు తీసుకోవాలి.
- శారీరక శ్రమ శరీరాన్ని బలోపేతం చేస్తుంది.
- రోజుకు 30 నిమిషాల పాటు వ్యాయామం చేయాలి.
- సమతుల్యమైన ఆహారం కోసం పండ్లు, కూరగాయలు, పప్పు దినుసులు తీసుకోవాలి.
- వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి.

ఇవి తప్పనిసరి పాటించాలి

- పొగమంచులో ప్రయాణం చేసేటప్పుడు వాహనాన్ని తక్కువ వేగంతో నడపాలి.
- తక్కువ బీమ్‌లో హెడ్‌లైట్లను సెట్ చేసుకోవాలి.
- దట్టమైన పొగమంచు ప్రాంతాల్లో డ్రైవింగ్ చేస్తున్నప్పుడు వార్నింగ్ లైట్‌ను ఆన్ చేసుకొని ప్రయాణించడం బెటర్.
- జాతీయ రహదారులపై ప్రయాణిస్తున్నప్పుడు లేన్‌ను మార్చకూడదు.
- వాహనాలు కనిపించకపోతే ఇండికేటర్ ఉపయోగించాలి.
- వాహనం అద్దాలను లోపల, బయట క్లీన్‌గా ఉంచుకోవాలి.
- వాహనాన్ని ఓవర్‌టేక్ చేసేందుకు ప్రయత్నించవద్దు.

పలు ఘటనలు

పొగమంచు కారణంగా ఇటీవల మండల పరిధిలోని నాగర్‌గూడ, చందనవెల్లి గ్రామాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా, పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. అలాగే ముందు వాహనాలు కనబడక పోతుగల్, షాబాద్, సర్దార్‌నగర్ తదితర ప్రాంతాల్లో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గతంలో పాఠశాల బస్సు ఢీకొని ఇరువురు గాయపడ్డారు.

జాగ్రత్తలు ముఖ్యం



చలి విజృంభిస్తున్న సమయాల్లో చిన్నపిల్లలు, వృద్ధుల పట్ల జాగ్రత్త తీసుకోవాలి. దగ్గు, జలుబు లాంటివి ఉంటే సమీపంలోని పీహెచ్‌సీకి వెళ్లి చికిత్స చేయించుకోవాలి. అక్కడ అన్ని రకాల పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. కొవిడ్ భయాలు ఏ మాత్రం వద్దు. – డాక్టర్ విజయలక్ష్మి, పీహెచ్‌సీ, షాబాద్

వేగం తగ్గించాలి



పొగమంచు కురిసే సమయాల్లో వేగాన్ని తగ్గించి వాహనాలు నడపాలి. హెడ్ లైట్లు, ఎల్లో ఇండికేటర్స్ వేసుకోవాలి. వాహనాలకు రేడియం స్టిక్కర్లు తప్పకుండా ఉండాలి. డ్రైవర్లు వాహనాల మధ్య దూరం పాటించాలి. ముందు ఆగి ఉన్న వాహనాలను గుర్తిస్తూ నడపాలి. – కాంతారెడ్డి, సీఐ షాబాద్